వాకిట్లో 'పోస్ట్' అన్న కేక వినపడగానే పరిగెత్తుకు వెళ్ళింది సాందీపని. పోస్ట్‌మాన్ యిచ్చిన వుత్తరం తీసుకుని వస్తుంటే చింటూ వెంటబడ్డాడు... "నాకివ్వు" అంటూ.

"అమ్మా! చింటూ చూడే" అంటూ వుత్తరం తీసికెళ్ళి అమ్మ చేతిలో పెట్టింది.

ప్రెషర్‌కుక్కర్ స్టౌవ్‌మీద నుండి దించి చేతులు కొంగుకు తుడుచుకుంటూ 'వుండమ్రా' అని వుత్తరం చదువసాగింది సువర్ణ.

ఉత్తరం చదువుతూ వుంటే ఆమె కనుల వెంట నీరు కారసాగింది.

"నాన్నా! ఇటురా! అమ్మ ఏడుస్తుంది" అంటూ పరుగెత్తుకుని ముందుగదిలో కూర్చున్న నాన్న దగ్గరకు వెళ్ళి చెప్పింది సాందీపని.

"ఏమిటే నీగోల" అంటూ చదువుతున్న పేపరు అవతలపడవేసి వచ్చాడు రాజశేఖర్. నేల మీద చతికిలబడి దిగాలుగా కూర్చున్న సువర్ణ వంక ఏమిటన్నట్లు చూచాడు.

"తెనాలి అమ్మమ్మకి బాగాలేదట. ఒకసారి వచ్చి చూసి వెళ్ళమని వుత్తరం వ్రాయించింది."

"అలాగా! తప్పకుండా వెళ్ళివద్దాం! ప్రయాణానికి సిద్ధంగా వుండు. నేను ఆఫీసుకు శెలవు పెట్టి ఇప్పుడే వస్తా" అంటూ బట్టలు మార్చుకుని సైకిల్ వేసుకుని బయల్దేరాడు.

తెనాలి పక్కన పల్లెటూర్లో వుండే సీతమ్మగారు సువర్ణకు సొంత అమ్మమ్మ కాదు.. అమ్మమ్మ చెల్లెలు. ఆమెకు భర్త చిన్నప్పుడే పోయాడు... పిల్లలు లేరు! అక్క రాజమ్మకు ఒకటే కూతురు శకుంతల. అక్కకూతుర్ని ఆమె స్వంత కూతురుకన్న మిన్నగా చూచి పెంచి పెద్ద చేసింది. శకుంతలకు సువర్ణ, శామసుందర్ ఇద్దరే సంతానం. అయితే వాళ్ళిద్దర్నీ నేలమీద నడవకుండా అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసింది... వివాహాలు చేసింది.

సువర్ణ భర్త రాజశేఖర్‌కు, శ్యామసుందర్‌కూ హైద్రాబాదులో వుద్యోగాలు వచ్చి వెళ్ళినా పురుళ్ళనీ పుణ్యాలనీ చీమ చిటుక్కుమన్నా పరిగెత్తుకు వచ్చి అభం శుభం చూచి వెళు తుండేది సీతమ్మ. డెబ్భై ఏళ్ళు దాటినా ఆరోగ్యంగా తిరగలపిడిలా వుండే సీతమ్మగారికి అనారోగ్యం ఏమొచ్చిందో అనుకుంటూ ఆఫీసులో శెలవు తీసుకుని బావమరిది శ్యామ్ ఆఫీసుకు ఫోను చేసాడు.

అమ్మమ్మకు బాగాలేదని అంతకు ముందే శెలవు పెట్టి వెళ్ళిపోయ్యాడని చెప్పారు ఆఫీసులో వాళ్ళు. స్టేషన్‌కు వెళ్ళి కృష్ణాఎక్స్‌ప్రెస్‌లో టికెట్లు తీసుకుని యింటికి వచ్చాడు రాజశేఖర్.

ఇల్లంతా సర్ది రెడీగా వుంది సువర్ణ. ఉత్తరం వచ్చిన దగ్గర్నుండీ ఏడుస్తోందిలా వుంది ముఖం వుబ్బివుంది. భర్తను చూడగానే "అన్నయ్యకు కూడా చెప్పకపోయారా ?" అంది

''శ్యాఫ్ కూడా శెలవుపెట్టి బయలుదేరి వెళ్ళాడన్నారు వాళ్ళ ఆఫీసులో వాళ్ళు'' అన్నాడు రాజశేఖర్.

రాజశేఖర్ భోంచేశాక ఆటోలో బయల్దేరారు స్టేషన్‌కు. అపూట సువర్ణ భోజనం చేయలేదు. కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కాక శ్యామసుందర్ అతని భార్య రజని, వాళ్ళ అబ్బాయి రాజేష్ కనపడ్డారు.

వదినను చూడగానే ఆపుకున్న దుఃఖం కట్టలు తెగింది సువర్ణకు. మరదలు ఏడ్పు చూసి తానూ శ్రుతి కలిపింది రజని. కష్టానికీ సుఖానికి కాకితో కబురంపితే చాలు పరుగెత్తుకొని వచ్చి అండగా వుంటూ వచ్చిన సీతమ్మగారికి ప్రమాదంగా వుండంటే వదినా మరదళ్ళకు దుఃఖం ఆగలేదు.

రైలుపెట్టెలో జనం తమవంకే చూస్తున్నారని సంబాళించుకున్నారుగాని లేకపోతే వదినా మరదళ్ళు తెనాలి జేరినదాకా ఏడ్పు మానేవాళ్ళు కారు !

రాజేష్ సాందీపనికంటె రెండేళ్ళు పెద్ద. కాన్వెంటులో మూడో తరగతి చదువుతున్నాడు. ఒకటో తరగతి చదివే మరదలును వుడికించాలని—

''వాట్ ఎ నాటీ గర్ల్ యు ఆర్'' అన్నాడు.

''అమ్మా! ఈ రాజు చూడు ! వాట్ ఎ నాటీ ఎ గర్ల్ అంటున్నాడు'' అంటూ ఫిర్యాదు చేసింది తల్లితో.

సువర్ణ ''తప్పమ్మా ! బావను రాజు అని పిలవకూడదు. రాజుబావ అని పిలువు ! లేకపోతే బావ అని పిలువు'' అంది.

వెంటనే ''బావ బావ పన్నీరు'' అంటూ ఆదవపాగింది సాందీపని.

''సిసింద్రీ మాటలు మానవు గదా'' అంటూ మళ్ళీ కబుర్లల్లో పడిపోయింది సువర్ణ.

గెలుపెవరిది?

''వూరుకో వదినా ! సాందీపని మాత్రం ఏమంది ! చిన్నపిల్లలు అల్లరి చేయకపోతే మనం చేస్తామా ?'' అంది రజని.

తెనాలిస్టేషన్ రాగానే అంతా దిగి ఒక జట్కాలో బయద్దేరారు జాగర్లమూడి.

సీతమ్మగారు వున్న ఆస్థి అంతా ఇదివరకే శ్యామసుందర్ చదువుకూ, సువర్ణ పెళ్లికీ కర్చు చేసింది. ఉన్న అరెకరం నిమ్మతోట పక్కనవున్న చిన్న పెంకుటింట్లో వుంటూ వచ్చినఆదాయంతో గుట్టుచప్పుడుకాకుండా కాలక్షేపం చేస్తూవుంది. నగలుకూడా చాలావరకు సువర్ణకూ, రజనికి ఇదివరకే ఇచ్చివేసింది. కానీ రవ్వల పోగులు మటుకు ఎవరకూ ఇవ్వకుండా అట్టేపెట్టుకుంది.

జట్కాదిగి లోపలకు వెళ్లి మగతగా పడి వున్న సీతమ్మ చుట్టూ చేరారంతా.

''అమ్మమ్మా ! అమ్మా'' అంటూ పిలిచింది సువర్ణ. చిన్నప్పుడు ''అమ్మా'' అని కొంచెం పెద్దయాక కొంతసేపు ''అమ్మమ్మా'' అని కొంతసేపు ''అమ్మా'' అని పిలిచేది సువర్ణ.

సీతమ్మ మూసిన కళ్లు తెరవలేదు. మంచం పక్కన కూర్చుని మరలా ఏడ్వడం మొదలెట్టింది సువర్ణ.

రజనికూడా కళ్ళు వత్తుకుంటూ కూర్చుంది పక్కనే ! రాజశేఖర్, శ్యామసుందర్ జట్కాలో తిరిగి తెనాలి వెళ్ళారు డాక్టరుగారిని పిలుచుకురావటానికి.

ఇరుగు పొరుగునారు పరామర్శకు వచ్చి ''మూడు రోజులనుండి మూసిన కన్ను తెరవ కుండా పడివుంటే వుత్తరం వ్రాసాము. నిన్నటి నుండి మరీ పచ్చి మంచినీళ్ళుకూడా తాగటం లేదు'' అన్నారు.

పడమటి వీధి పకీరమ్మ ''నాకేమిటో

అవినాశిని

రైలుపట్టాల పక్కన
మునలితనానికి
ఆలంబనం
అడుగులేస్తున్న బాల్యం,
మొదటిది నశించినా
అందులోంచే
అంగలు వేసేది రెండోది !

— నిఖిల్

అనుమానంగా వుందమ్మాయి. ఎడమచేయి కాలూ కదలడంలేదు. పక్షవాతం వచ్చిందను కుంటా'' అంది.

తూర్పువీధి తులసమ్మ ''పక్షవాతంలో స్పృహపోయింది గట్టెక్కడం కష్టం'' అంది

''అలాగా, మిగిలిన ఆస్తి ఎవరికిస్తుందో ; ఏమైనా ఏర్పాట్లు చేసిందా ?''

''ఏర్పాట్లకేముంది ? తోట ఇల్లు శ్యామ సుందర్‌కు వీలునామా వ్రాసింది ! నగలన్నీ ఇదివరకే మనుమరాళ్ళకిచ్చింది. ఇక రవ్వల పోగులు ఎవరికివ్వాలనుకుందో తెలియలేదు'' అంది పకీరమ్మ.

ఏడ్పుల మధ్య వెక్కుతూ ''సువర్ణా ! రవ్వల పోగులు నీకేనే అంది అమ్మమ్మ'' అంది సువర్ణ.

''ఆమె నగలన్నీ నువ్వే తీసుకున్నావు ! రవ్వల పోగులు కూడా నీకేనా ? నేనొప్పకోను'' అంది రజని.

''మా అమ్మమ్మ నగలు నేను తీసుకోక మరెవరు తీసుకుంటారు. అమ్మమ్మకు నేనంటే ప్రాణం. స్పృహ వున్నట్లయితే పోగులు నా కిమ్మని చెప్పేది.''

''నాకు నువ్వొకటి, సువర్ణవొకటి కాదు!'' అనేవారు. ఆమె రవ్వల పోగులు నాకే ఇచ్చేవారు.''

''అంతా అబద్ధం ! నీకు పోగులు ఇస్తే నేనూరుకునే దాన్ననుకున్నావా ! అమ్మమ్మ నా మాట కాదనేదిగాదు. పురిటిబిడ్డ దగ్గర్నుండీ పెంచి పెద్దచేసింది నన్ను ! ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి అనుకుంటున్నావా ?''

''నీ బుద్ధి పోనిచ్చావ్ గాదు. పేరాశ పెదవికి చేటన్నారు. రవ్వల పోగులు నీకెలా వస్తాయో నేను చూస్తా !''

''అమ్మో ! మా యింటికొచ్చి నన్నే అంటావా ! చూడు...'' తెనాలి నుండీ డాక్టరు రావడంతో యుద్ధం ఆపి తాత్కాలికంగా సంధి కుదుర్చుకున్నారు వదినా, మరదలూ.

రోగిని పరీక్ష చేసి ఇంజక్షన్ చేసారు



డాక్టరుగారు. "వైరల్ ఫీవర్! మరేం ఫరవా లేదు! ఒకటి రెండు రోజులలో జ్వరం తగ్గిపోతుంది" అన్నాడాయన.

రాజశేఖర్ శ్యామసుందర్ డాక్టర్‌గారిని పంపడానికి బయటకు వెళ్లారు.

సీతమ్మగారికి జబ్బు నెమ్మదిస్తుందని తెలియగానే సువర్ణ, రజని, తగూవడడం మాని వేసారు. అందరిముందూ రవ్వల పోగుల కోసం తగూలాడుకున్నందుకు సిగ్గుపడ్డారు కూడా.

పక్కింటావిడ కాఫీ తీసుకువస్తే "నువ్వు తాగొదినా" అంటే "నువ్వు తాగు వదినా" అంటూ మర్యాద చేసి కోవడం మొదలెట్టారు!

డాక్టరుగారు చెప్పినట్లు మరుసటి రోజుకు సీతమ్మగారికి జ్వరం తగ్గింది. కళ్ళు తెరిచి అందరినీ పరీక్షగా చూడసాగింది.

మనుమడు, మనుమరాలు, మునిమనుమ సంతానం అందర్నీ పరీక్షగాచూసింది. ఏదో తృప్తి ఆమె మనసంతా నిండిపోగా "ఎప్పుడొచ్చార్రా మీరు" అంది.

"తాతమ్మా, మరే మేమంతా నిన్న వొచ్చాం! నిన్నే అమ్మా రజనీ అత్తయ్యా నీ రవ్వలపోగులు నా వంతే నావని తగూలాడుకున్నారు" అంటూ ఆమె దగ్గరకు వెళ్ళి చెప్పింది సాందీపని.

"నా బంగారమే! నువ్వు కూడా వచ్చావా అమ్మా" అంటూ సాందీపని వళ్ళు నిమురుతూ వుండి పోయింది సీతమ్మ.

తర్వాత నాలుగయిదు రోజులలోనే సీతమ్మ గారికి నెమ్మళించడంతో అంతా మరలా హైద్రాబాదు ప్రయాణమయిపోవటానికి సిద్ధమయ్యారు!

రవ్వలపోగుల కోసం తామిద్దరూ తగూలాడుకున్న వైనం సీతమ్మకు తెలిసిపోయిందని సిగ్గుపడిపోయారు సువర్ణ, రజని. వున్నన్నాళ్ళు తల ఎత్తి ఆమె ముఖం చూడలేక బాధపడి పోయారు!

"అమమ్మా! వొంటరిగా నువ్విక్కడెందుకు. మావెంట రారాదూ?" అని శ్యామసుందర్ అంటే —

"అదేమిట్రా శ్యామూ? నాకేమయింది? శుభ్రంగా తిని తిరుగుతుంటిని కొన్నాళ్ళపాటు వుండనియ్. ఎటుదిరిగీ రాజా, సందూ వాళ్ళ పెళ్ళిళ్ళకు రావాలిగా" అంది సీతమ్మ

"అమ్మో! చూసావా ఎన్నాళ్ళు బతకాలని ప్లాన్ వేస్తుందో?" అంటూ ఫక్కున నవ్వారు పక్కయిళ్ళవాళ్లు.

* * *

రాజేష్ యం.కాం. పాసయి బ్యాంకులో వుద్యోగంలో జేరాడు. సాందీపని బి.యే. పాసయి సెక్రెటేరియేట్‌లో జాబ్‌లో చేరింది.

శ్యామసుందర్ రాజశేఖర్ వియ్యమందుదామని నిశ్చయించుకుని శుభలేఖలు అచ్చువేయించారు. ఇద్దరూ జాగర్లమూడి వెళ్ళి టాక్సీలో సీతమ్మగారిని హైద్రాబాద్ తీసికొనివచ్చారు.



సాందీపనిని పెళ్ళికూతుర్ని చేసి ఒకో అలంకారం చేయసాగారు సువర్ణ, రజని.

"వుండడ్రా! ఒక్క నిముషం ఆగండి" అంటూ లోపలకు వచ్చింది సీతమ్మ.

వణుకుతున్న చేతుల్తో నెమ్మదిగా రవ్వల పోగులు తీసి రజని చేతిలో వుంచి "కోడలు పిల్లకు అలంకరించవే" అంది.

పదిహేను సంవత్సరాల క్రిందట వీటికోసం తగూలాడుకున్నాం అన్న విషయం గుర్తొచ్చి రజని, సువర్ణ సిగ్గుతో తల వంచుకున్నారు.

తాతమ్మ రవ్వలపోగులు రజనత్త చెవులకు తగిలిస్తుంటే సాందీపని కళ్లు గర్వంతో మిలమిల మెరిసాయి!

పెండ్లి అయి మునిమనుమడూ ముని మనుమరాలూ వచ్చి కాళ్ళకు నమస్కరిస్తుంటే దీవిస్తూ తృప్తిగా చూసింది సువర్ణ, రజనీల వంక సీతమ్మ.

"వదినా! గెలుపు నీదే!" అంది రజని.

"సాందీపని ఇవాల్టినుంచీ నీ కోడలు! అందువల్ల గెలుపు నీదే" అంది సువర్ణ.

"ఇంకా మీ తగూలు తీరలేదంట్రా!" అంటూ బోసినోరు బయటపడేలా ఫకాలున నవ్వింది సీతమ్మగారు!